ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 15 జనవరి 2024





జీఓ ప్రతులను దహనం చేస్తున్న ఉపాధ్యాయులు

నిరసన మంటలు

భోగి మంటల్లో.. జీఓ ప్రతులు బుగ్గి..

సంక్రాంతి భోగి మంటలు.. నిరసన మంటలుగా చెలరేగాయి. ఆదివారం భోగి మంటల్లో ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ ప్రతులను దహనం చేశారు.

భోగి మంటల్లోకి చెత్త జీఓలు..



భోగి మంటల్లో జీఓ ప్రతులను దహనం చేస్తున్న బీకే, నాయకులు

రొద్దం, జనవరి 14: వైసీపీ పాలకులు తీసుకొచ్చిన జీఓలన్నీ చెత్తవంటూ టీడీపీ నేతలు జిల్లావ్యాప్తంగా భోగి మంటల్లో వాటిని వేసి, కాల్చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి అనంతపురంలోని స్వగృహంలో ఉదయం 6 గంటలకే భోగి మంటలు వేసి, చెత్త జీఓ ప్రతులను దహనం చేసి, నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి పట్టిన కీడు భోగి మంటలతో తొలగిపోవాలని కోరారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వందలాది జీఓలు తెచ్చి ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెట్టిందన్నారు. 'సైకో పోవాలి.. బా బు రావాలి..' అన్న పోస్టర్లను విడుదల చేశారు. సంక్షేమ పథకాల పేరుతో అరకొరగా ప్రజలకు అందించి, గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధి కార్యక్రమాలే ఇప్పటికీ కళ్ల ముందు కనిపిస్తున్నాయన్నారు. వైసీపీ పాలనలో గ్రామాల్లో కనీసం సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేసిన పాపాన పోలేదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమతో మంచి కలగాలని ఆకాంక్షించారు.

పుట్టపర్తి రూరల్: సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 34వ రోజు జిల్లా వ్యాప్తంగా భోగిమంటల్లో ఎస్మా ప్రతులను దహనం చేశారు. మడకశిర, రొద్దం, చిలమత్తూరులో ప్రభుత్వం వి డుదల చేసిన ఎస్మా ప్రతు లను భోగి మంటల్లో వేసి, నిరసన తెలిపారు. మడకశిరలో ఎస్మా ప్రతులను భోగి మంటల్లో దహనం చేస్తూ.. ప్రదక్షిణగా నిరసన వ్యక్తం చేశారు.

ఎస్మా ప్రతుల దహనం



మడకశిరలో ఎస్మా ప్రతులను భోగిమంటల్లో వేసి నృత్యం చేస్తున్న అంగన్‌వాడీలు

యూటీఎఫ్ ఆధ్వర్యంలో...

గోరంట్ల: జీఓ నంబరు 117 ప్రతులను స్థానిక మార్కెట్ యార్డు సమీపాన భోగిమంటల్లో యూటీఎఫ్ నేతలు దహనం చేశారు. వారు మాట్లాడుతూ.. జీఓ నంబర్ 117తో ఉపాధ్యాయులకు తీరని నష్టం వాటిల్లుతోందన్నారు. ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యాయయన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను దూరం చేసేందుకు ఈ జీఓ దోహద పడిందన్నారు. జీఓను వెంటనే రద్దు చేయాలనీ, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలనీ, విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కిష్టప్ప, మురళి, నగేష్, చాంద్‌బాషా, కృష్ణప్రసాద్, మధు, నరసింహులు, కృష్ణమూర్తి, వెంకటరాముడు, ఆంజనేయులు, ఆదినారాయణ, వెంకటనరసప్ప, కిష్టప్ప పాల్గొన్నారు.

నాసిన్.. ఓ మైలురాయి..

టీడీపీ హయాంలో బీజం

అత్యున్నతశ్రేణి శిక్షణ అకాడమీగా ఖ్యాతి

దక్షిణ భారతదేశంలో అతి పెద్దది..

ప్రారంభానికి ముస్తాబు



నాసిన్ ప్రధాన ముఖద్వారం



సిద్ధమైన నాసిన్ ప్రాంగణం



శిక్షణ భవన సముదాయం

పుట్టపర్తి, జనవరి14 (ఆంధ్రజ్యోతి): ఆటోమొబైల్ హబ్‌గా ప్రపంచ దేశాలను ఆకర్షిస్తున్న జిల్లా సిగలో మరో మైలురాయి చేరబోతోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన దేశంలోనే రెండో అతిపెద్ద శిక్షణ సంస్థ నాసిన్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ పరోక్ష పన్నులు, నార్కోటిక్స్) జిల్లాలో ఏర్పాటైంది. నిర్మాణం పూర్తి చేసుకుని, ప్రారంభానికి సిద్ధమైంది. ఈనెల 16వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. నాసిన్ ఏర్పాటుతో జిల్లా ఉన్నత విద్యాసంస్థల పరంగా ల్యాండ్‌మార్క్‌గా మారనుంది. ఒకప్పుడు ఉమ్మడి అనంత జిల్లా అంటే కరువు ప్రాంతం. ఇలాంటి జిల్లాను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దేందుకు టీడీపీ హయాంలో బీజం పడింది. ఇతర రాష్ట్రలతో పోటీ పడి అంతర్జాతీ స్థాయి కియ కార్ల పరిశ్రమను 2016లో జిల్లాకు తీసుకొచ్చి, పెనుకొండలో ఏర్పాటు చేయించారు. రాష్ట్రంలో ఏర్పాటైన తొలి కార్ల పరిశ్రమగా కియ నిలిచింది. ఇదే ఒరవడిని కొనసాగించి రాష్ట్ర విభజనలో భాగంగా ప్రత్యేక చొరవతో ఉమ్మడి జిల్లాలకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన నాసిన్, భారత్ ఎలక్ట్రానిక్స్ డిఫెన్స్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ సముదాయం (బెల్)ను జిల్లాకు తీసుకొచ్చారు. బెల్, నాసిన్, కియ రాకతోపాటు అనుబంధ సంస్థలు క్యూ కట్టాయి. రైతు, యువతకు ఉపాధి అవకాశాలు వచ్చిపడ్డాయి. అప్పట్లో బీజం పడిన నాసిన్ ఎట్టకేలకు పూర్తయింది. ఈనెల 16న నాసిన్‌ను ప్రారంభించేందుకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ రానుండడంతో దేశవ్యాప్తంగా అందరి చూపు జిల్లాపై పడింది.

టీడీపీ హయాంలో శంకుస్థాపన

రాష్ట్ర విభజన తరువాత కేంద్ర ప్రభుత్వ ప్రైవేటు రంగంలోని పెద్ద సంస్థలను ఏర్పాటు చేయిస్తే ఉద్యోగాల కోసం ఈ ప్రాంతానికే వలస వచ్చే రోజులు వస్తాయని టీడీపీ హయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భావించారు. పరిశ్రమల పేరుతో భూములు తీసుకుని అర చేతిలో వైకుంఠం చూపుతారన్న వారి నోళ్లకు తాళం వేసింది కియ. జిల్లా ఆటోమొబైల్ హబ్‌గా అవతరించింది. వైజాగ్-చెన్నై, బెంగళూరు-అనంతపురం పారిశ్రామిక కారిడార్‌కు దారులు ఏర్పడ్డాయి. ఉపాధి కల్పన జిల్లాగా మారిపోయింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు నాసిన్, బెల్ ఏర్పాటుకు చకచకా భూములు కేటాయించారు. నాసిన్‌కు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ 2015 ఏప్రిల్ 11న గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామ సమీపాన 44వ జాతీయ రహదారి పక్కన శంకుస్థాపన చేశారు. 500.35 ఎకరాల్లో రూ.541.63 కోట్ల అంచనా వ్యయంతో నాసిన్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మంత్రి అరణ్ జైట్లీ అప్పట్లో ప్రకటించారు. ఆరేళ్లుగా భూముల చుట్టూ ప్రహరీ, అంతర్గత రోడ్ల పనులు చేపట్టారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2022 మార్చి 5న నాసిన్ భవనాల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. బడ్జెట్ సైతం కేటాయించడంతో పనుల్లో వేగం పుంజుకుంది. కొన్నింటి పనులు ఇంకా కొనసాగుతున్నా.. పూర్తయిన భవనాలతోపాటు 2023 డిసెంబరు నాటికి మొదటి బ్యాచ్ శిక్షణ ప్రారంభించాలని భావించారు. పెనుకొండ వద్ద కియ, అనుబంధ సంస్థలు, పాలసముంద్రం వద్ద నాసిన్, పక్కనే బెల్, ఏర్పాటుతో ఆటోమొబైల్, విద్యాహబ్‌గా జిల్లా అవతరిస్తోంది.

దక్షిణ భారతదేశంలోనే పెద్దది..

దేశంలోనే మొట్టమొదటి సారిగా 1996లో హరియాణాలోని ఫరీదాబాద్‌లో 23 ఎకరాల్లో నాసిన్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, ముంబైలో జోనల్ కేంద్రాలున్నాయి. తాజాగా పాలసముద్రం వద్ద 500.34 ఎకరాల్లో దేశంలోనే రెండో నాసిన్‌ను ఏర్పాటు చేశారు. విస్తీర్ణం పరంగా ఇది పెద్దది కూడా. ఇక్కడ జాతీయ స్థాయిలో యూపీఎస్సీలో నిర్వహించే పోటీ పరీక్షల్లో ఎంపికైన ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ (ఐఆర్ఎస్) అభ్యర్థులకు శిక్షణ ఇస్తారు. పరోక్ష పన్ను వసూళ్లలో సామర్థ్యాన్ని పెంపొందించే అంశాలపై శిక్షణ ఇస్తారు. ఇందులో జీఎస్టీ, కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్, సేవాపన్నులు, మాదక ద్రవ్యాల నియంత్రణ, యాంటీ మనీల్యాండరింగ్, సైబర్ సెక్యూరిటీ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు.



అలరించిన
భక్త కనకదాసు నాటిక

పుట్టపర్తి, జనవరి 14: బృందావనం క్యాంప్‌నకు చెందిన సత్యసాయి విద్యార్థులు ప్రదర్శించిన భక్త కనకదాసు నాటిక భక్తులను అలరింపజేసింది. ఆదివారం స్థానిక ప్రశాంతినిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో సత్యసాయి విద్యార్థులు సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మొదట ప్రశాంతి నిలయం క్యాంప్ విద్యార్థులు సంగీత గానకచేరి చేశారు. అనంతరం విద్యార్థులు కనకదాసు జీవిత చరిత్రపై నాటికను ప్రదర్శించారు. సంగీత గానకచేరి, సాంస్కృతిక కార్యక్రమాలు, నాటిక ప్రదర్శన ఆకట్టుకున్నాయి. అనంతరం వారు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థులు

వైభవంగా గోదా కల్యాణం



కల్యాణ వేదికపై కొలువుదీరిన గోదాదేవి, రంగనాథస్వామి



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

హిందూపురం అర్బన్, జనవరి 14: పట్టణ పరిధిలోని ఎంఎఫ్ రోడ్డులో వెలసిన శ్రీ లక్ష్మీహయగ్రీవ ఆలయంలో ఆదివారం శ్రీ గోదాదేవి, రంగనాథస్వామి తిరు కల్యాణోత్సవం వైభవంగా సాగింది. ధనుర్మాస ముగింపును పురస్కరించుకుని ఏటా సంక్రాంతి పండుగ రోజున గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణోత్సం నిర్వహించడం ఆనవాయితీ. తెలవారుజాము నుంచి మూల మూర్తులకు అభిషేకాలు, అర్చనలు చేసి సార్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

వైసీపీలో ఎంపీటీసీల తిరుగుబాటు

● అవిశ్వాసానికి పట్టు

బొమ్మనహాళ్, జనవరి 14: మండలంలోని 16 మంది వైసీపీ ఎంపీటీసీ సభ్యులు తిరుగుబాటు చేశారు. ఆదివారం ఉప్పరహాళ్ ఎంపీటీసీ ముల్లంగి నాగమణి స్వగృహంఎల్‌బీనగర్ గ్రామంలో ఎంపీటీసీ సభ్యులు సమావేశమై ఎంపీపీ పద్మ తక్షణమే రాజీనామా చేయాలని, లేని పక్షంలో 12 ఎంపీటీసీ సభ్యుల మద్దతు ఉపసంహరించుకుంటామని ముల్లంగి నాగమణి, నేమకల్లు ఎంపీటీసీ చిక్కణ్ణ, సింగానహళ్లి ఎంపీటీసీ తిప్పేస్వామి, కొళగానహళ్లి ఎంపీటీసీ తిమ్మప్ప విలేకరులతో అన్నారు. ఎంపీపీ పద్మకు ఎలాంటి అర్హత లేకపోయినప్పటికీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డికి అనుకూలమని ఒకే సామాజిక వర్గం ఉండడంతో ఎంపీపీగా ఎన్నుకోవాలని తమపై ఒత్తిడి తెచ్చారని తెలిపారు. రాయదుర్గం వైసీపీ అసెంబ్లీ టిక్కెట్ మెట్టు గోవిందరెడ్డికి అధిష్టానం కేటాయించడంతో ఎంపీటీసీలు అంతా ఏకమై ఎంపీపీని మార్చాలని డిమాండ్ తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ముల్లంగి నారాయణస్వామి మెట్టు వర్గం కావడంతో ఆయన సతీమణి ముల్లంగి నాగమణికు ఎంపీపీగా భావించినట్లు తెలుస్తోంది. కాపు రామచంద్రారెడ్డి వైసీపీకి దూరం కావడంతో బొమ్మనహాళ్ మండలంలో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. గతంలో ఎంపీపీని ఎన్నుకున్న సమయంలో ముల్లంగి నారాయణ స్వామి తన భార్యకు ఎంపీపీ పదవి దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. అధిష్టానం ఎంపీపీ పదవిని శ్రీధరఘట్ట ఎంపీటీసీ సభ్యురాలు పద్మకు కేటాయించింది. కాపు రామచంద్రారెడ్డి వైసీపీకి దూరం కావడం వల్ల ఎంపీటీసీ సభ్యులు ముల్లంగి నారాయణస్వామి పక్కన చేరి ఎంపీపీ పద్మకు మద్దతు ఉపసంహరించుకోవాలని కొళగానహళ్లి, బొమ్మనహాళ్, ఉద్దేహాళ్, సింగానహళ్లి, గోవిందవాడ-1, ఉంతకల్లు తదితర గ్రామాల ఎంపీటీసీల సభ్యులు సమావేశమయ్యారు. ఎన్నికల వేళలో వైసీపీలో వర్గపోరు బహిర్గతం కావడంతో అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం


చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకున్న వీఆర్వో

లేపాక్షి, జనవరి 14: ప్రభుత్వ భూమి కబ్జా చేసేందుకు హిందూపురానికి చెందిన ఓ వ్యక్తి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. లేపాక్షిలోని జడ్పీ హైస్కూల్ వద్ద ప్రధాన రహదారి పక్కనే ప్రభుత్వ భూమి ఎకరా ఉంది. దీని విలువ దాదాపు రూ.కోటి ఉం టుంది. దీనిని రియల్ వ్యాపారి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. శనివా రం ఎక్స్‌కవేటర్‌తో పొలంలో ఉన్న కంపచెట్లను తొలగించాడు. విషయాన్ని స్థా నికులు సంబంధిత వీఆర్‌ఓ నాగరత్నమ్మ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఆమె స్పందించి స్థలం వద్దకు చేరుకుని పనులను నిలిపివేయించారు. ఇది ప్రభుత్వ స్థలమని ఏదైనా సమాచారం కావాలంటే సర్వే చేయించుకోవాలని ఆమె సూచించారు. దీంతో పనులు ఆపేసి ఎక్స్‌కవేటర్‌ను వెనక్కు పంపేశారు. తిరిగి సర్వే చేయించకుండా పనులు చేస్తే ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

రీసర్వేలో గోల్‌మాల్

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం భూములన్నీ రీసర్వే చేసింది. ఈ కార్యక్రమంలో భూములు లేని వారికి ప్రభుత్వ భూమిని ఇవ్వకుండా రియల్టర్ల పేరిట రీసర్వే చేసి వారికి కేటాయిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా కంచిసముద్రం, కొండూరు, కల్లూరు పంచాయతీల్లో రియల్టర్ల పేరిట పాసుపుస్తకాలు చేస్తున్నారని అభియోగాలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి రీసర్వేను పక్కాగా అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

జగన్‌రెడ్డిని గద్దె దింపి తీరుతాం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్


మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లుటౌన్, జనవరి 14: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం జగన్‌రెడ్డిని గద్దె దింపి తీరుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు డీ జగదీష్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాయలంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీని ఓడించి టీడీపీని అధికారంలోకి తీసుకురావలనే ఉద్దేశ్యంతో సీట్లు సర్దుబాటు చేసుకోవాలని మా పార్టీ నిర్ణయించిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావలన్నా, రైతు సమస్యలు పరిష్కారం కావాలంటే టీడీపీ అధికారంలోకి రావలసిన అవసరం ఉందన్నారు. వైసీపీ ఓడించడానికి మా ఒక్క పార్టీ బలం చాలదని, టీడీపీతో పాటు రాష్ట్రంలోని ప్రతిపక్షాలు ఏకమై జగన్‌రెడ్డి దించాలని పిలుపునిచ్చామన్నారు. మరోపక్క టీడీపీ అధికారంలోకి రాకుండా చేయడానికి జగన్‌రెడ్డి కుట్ర రాజకీయాలకు తెరలేపాడని ఆయన ఆరోపించారు. ప్రతి పక్షాల ఓట్లు చీల్చడానికి జగనన్న బాణం షర్మిలను కాంగ్రెస్‌లోకి పంపుతున్నట్లు అనుమానం కలుగుతోందన్నారు. దీని ద్వారా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు టీడీపీ పడకుండా కాంగ్రెస్‌కు పడితే టీడీపీని నష్ట పరచాలని జగన్ రెడ్డి చేస్తున్నాడని ఆయన విమర్శించారు. టీడీపీతో ఎన్నికల సీట్లు సర్దుబాటు జరిగితే అనంతపురం పార్లమెంట్ కాని, అసెంబ్లీకి పోటీ చేయాలనే యోచనలో సీపీఐ ఉందని ఆయన తెలిపారు. నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల సహాయకార్యదర్శి రామాంజనేయులు యాదవ్ పాల్గొన్నారు.

కమనీయం.. గోదాకల్యాణం..


అలంకరణలో వేంకటేశ్వరస్వామి, గోదాదేవి

గుంతకల్లుటౌన్, జనవరి 14: పట్టణంలోని రాజేంద్రనగర్‌లో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకులు ఉదయం స్వామివారి మూలవిరాట్టుకు విశేష పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో వేంకటేశ్వర స్వామి, గోదాదేవి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి కొలువుదీర్చారు. అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎం భాస్కర్ రంగయ్య, కార్యదర్శి నారాయణ స్వామి, ప్రసాద కమిటీ చైర్మన్ జయంతి వెంకట్, సభ్యులు రమేష్ రెడ్డి, సుదర్శన్ బాబు, ప్రవీణ్, కొండన్న, వెంకటేశులు, నాగభూషనం, నందీశ్వర్‌రెడ్డి, భక్తులు, దితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జేసీ అభిషేక్ కుమార్


ముమ్మరంగా సాగుతున్న రహదారి పనులు


శిక్షణ విమానాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

ప్రారంభానికి ముస్తాబైన నాసిన్

● రేపు ప్రధాని మోదీ రాక

● పలు భవన నిర్మాణాలను ప్రారంభించనున్న పీఎం

● ఏర్పాట్లలో నిమగ్నమైన జిల్లా యంత్రాంగం

గోరంట్ల, జనవరి 14: మండలంలోని పాలసముద్రం వద్ద ఏర్పాటైన నాసిన్ అకాడమీని ప్రధాన నరేంద్రమోదీ మంగళవారం ప్రారంభించనుండడంతో ఏర్పాట్లు చురుగా సాగుతున్నాయి. జాతీయ రహదారి పక్కన 503 ఎకరాల్లో రూ.542 కోట్ల వ్యయంతో నేషనల్ ఆకాడమి ఆఫ్ కస్టమ్స్ ఇన్‌డైరెక్టు ట్యాక్స్ అండ్ నార్కోటిక్స్‌ను నిర్మించారు. అంతర్జాయప్రమాణాలతో ఐఆర్‌ఎస్ విభాగంలో ఎంపికనైన వారికి కస్టమ్స్, నకిలీ కరెన్సీ, మణీల్యాడరింగ్, సైబర్ సెక్యూటీరిపై శిక్షణ ఇవ్వనున్నారు. ప్రధాని పర్యటనకు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తోపాటు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నరీజర్, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాల్గొననున్నారు. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లను జిల్లాకలెక్టర్ అరుణ్‌బాబు, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి పర్యవేక్షణలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్, తదితర అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అధిక సంఖ్యలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, పోలీసు అధికారులు మొత్తం యంత్రాంగమంతా రెండురోజులుగా ఇక్కడే మకాం వేసి పనులు చేస్తున్నారు. అకాడమీ భవన నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో జరగకపోయినప్పటికీ కొన్ని విభాగాలను ప్రధాని ప్రారంభించనున్నారు. దీంతో ప్రస్తుతం అకాడమీలో బీటీ రోడ్లను రేయింబవళ్లు వేస్తున్నారు. అడ్మిన్ స్టేట్ భవనం, ఫీల్డు ట్రైనింగ్ సెంటర్ ప్రారంభించిన అనంతరం ప్రధాని అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. ఇందుకోసం షెడ్ల నిర్మాణం, అలంకరణ పనులు యుద్ధప్రాతిపదికన కొసాగుతున్నాయి.


ప్రధాన రహదారి


నాసిన్ ఆవరణలో పనులు చేస్తున్న దృశ్యం

సీపీఐఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పెద్దన్న మృతి

● నివాళులర్పించిన సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల నేతలు


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు ఓబులు, రాంభూపాల్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 14: సీపీఐఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న గుండెపోటుతో ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో మృతి చెందారు. పెద్దన్న.. తరిమెల నాగిరెడ్డి సారథ్యంలో పనిచేశారు. ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి, పూర్తిగా ప్రజా ఉద్యమం కోసం కృషి చేశారు. నగరంలో ఇల్లు లేని నిరుపేదలకు యువజన కాలనీతో మొదలుకొని స్టాలిన్, రజకనగర్, మండ్ల సుబ్బారెడ్డి నగర్ వరకూ వేలాది మందికి ఇంటి వసతి కల్పించారు. ఎన్జీఓ నాయకుడిగా ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఆయన చేసిన కృషి మరువలేనిది. పంచాయతీరాజ్ శాఖలో పంప్ మెకానిక్‌ల రాష్ట్ర సంఘాన్ని, తెలుగు గంగ హెచ్ఆర్ వర్కర్స్ యూనియన్‌కు సారథ్యం వహించిన ఘనత ఆయనది. ఆయిల్‌ఫెడ్ కార్మికులు, హమాలీలను ఆర్గనైజ్ చేసి రజక వృత్తిదారుల సంఘాలకు బాసటగా నిలిచారు. రెండు సంవత్సరాలుగా గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చివరి క్షణం వరకూ ప్రజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన మృతికి సీపీఐఎంఎల్, ఏఐఎఫ్‌టీయూ నాయకులు నివాళులర్పించారు. ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సీపీఎం నేతలు ఓబులు, రాంభూపాల్, సీపీఐ నేతలు ఎంవీ రమణ, శ్రీరాములు, అల్లీపీరా, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు సరిపూటి రమణ, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి మల్లీశ్వరి, ఏపీఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌కుమార్, నాయకులు స్వామి, తరిమెల నాగిరెడ్డి ట్రస్టు సభ్యుడు సుధీర్‌కుమార్, కర్ణాటక రాజ్య రైతు సంఘం నాయకులు.. పెద్దన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


పెద్దన్న (ఫైల్)


నివాళి అర్పిస్తున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నేత ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, మానవహక్కుల సంఘం నాయకులు

తోపుదుర్తి ప్రకాష్ రెడ్డీ... ఒళ్లు జాగ్రత్త..!

● రామకృష్ణను విమర్శించే అర్హత నీకు లేదు..

● లక్ష ఎకరాలకు నీరిస్తానన్న మాట ఏమైంది?

● ఒక్క ఎకరాకూ ఇవ్వలేదే?

● రాప్తాడు ఎమ్మెల్యేపై సీపీఐ నాయకుల ఫైర్


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకులు

అనంతపురం విద్య, జనవరి 14: అనేక ఉద్యమాలు చేసి జైలుకెళ్లిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను విమర్శించే స్థాయి రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి లేదని, నీవు ఒళ్లు జాగ్రత్త పెట్టుకోవాలంటూ సీపీఐ నాయకులు హెచ్చరించారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి జాఫర్ ఇతర నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి దౌర్జన్యాలు మరోసారి బహిర్గతమయ్యాయన్నారు. జగనన్నకాలనీలో పశ్చిమ బెంగాల్ కార్మికులను నిర్బంధించడంపై ఆ రాష్ట్ర పార్లమెంట్ సభ్యుడు అనంతపురం జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి లేఖ రాశారన్నారు. ముందు ఈ ఘటనపై ప్రకాష్ రెడ్డి సంజాయిషీ చెప్పాలన్నారు. ఆయన అక్రమాలను, దౌర్జన్యాలను బహిర్గతం చేసే పత్రికలపైనా, రామకృష్ణపై విమర్శలు చేయడం తగదన్నారు. రామకృష్ణ 1994లో ఎమ్మెల్యేగా జిల్లా ప్రజలకు అనేక పోరాటాలు చేశారన్నారు. పీఏబీఆర్ కింద 49 చెరువులకు నీళ్లు తెచ్చిన ఘనత ఆయదేనన్నారు. ఆయన పోరాటం గురించి తెలియకపోతే....వైసీపీలోని సీనియర్ నాయకులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో ప్రకాష్‌రెడ్డికి పార్టీ టికెట్ ఇవ్వపోయినా, ఒక వేళ పోటీ చేసి ఓడిపోయినా...ఆయన ఇంటి వద్ద కుక్కలు కూడా ఉండవంటూ చురకలంటించారు. ప్రతిపక్షాలను తిడితే సీటు వస్తుందని, నువ్వు కూడా తిడుతున్నావన్నారు. కమ్యూనిస్టులపై మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి నారాయణస్వామి, కార్యవర్గసభ్యుడు శ్రీరాములు, రామకృష్ణ, లింగమయ్య, నారాయణస్వామి, కేశవరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్‌గౌడ్, వన్నారెడ్డి, పోతులయ్య, అల్లిపీరా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నెట్టికంటి ఆలయంలో పుష్యార్క హోమం

గుంతకల్లు, జనవరి14: పుష్యమాస ప్రారంభం సందర్భంగా కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం పుష్యార్క హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు. శాస్త్రోక్తంగా హోమాన్ని చేశారు. భోగి పండుగ సందర్భంగా ఆలయంలో స్వామివారికి విశేష అలంకారాలు చేశారు. గర్భగుడి బైట చెరకు గడలను ఉంచి అలంకరించారు. ఆలయం బైట భోగి మంటలను వేసి సంప్రదాయబద్ధంగా పండుగను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితుడు రామకృష్ణావధాని, ప్రధాన అర్చకుడు అనంతాచార్యులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

● 3 గంటలపాటు రోడ్డుపై శవంతో ఆందోళన

అమడగూరు, జనవరి 14: మృతుడు బూక్యా వెంకటరమణ నాయక్ కుటుంబానికి న్యాయం చేయాలని గిరిజన సంఘం నాయకులు దాదెంవారిపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై 3 గంటల పాటు ఆందోళన చేపట్టారు. హత్యకు కారకుడైన ఆర్ఎంపీ వైద్యుడి ఆస్తులు కుటుంబ సభ్యుల పేర్ల మీద రాసివ్వాలని డిమాండ్ చేశారు. సంఘటనకు సంబంధించి మృతుడి కుమారుడు నరసింహనాయక్ తెలిపిన వమేరకు వివరాలిలా ఉన్నాయి... మండలంలోని దాదెంవారిపల్లి తండాకు చెందిన బూక్యా వెంకటరమణనాయక్ (48) ఈనెల 7న ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అదృశ్యం కింద కేసు కింద నమోదు చేశారు. శనివారం కర్ణాటక రాష్ట్రం మల్లేపల్లి అడవిలో వెంకటరమణనాయక్ దారుణంగా హత్య చేసి, పెట్రోల్ పోసి నిప్పంటించారు. వెంకటరమణనాయక్‌తోపాటు లోజుపల్లికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ బాబు, పూలకుంటపల్లి గ్రామానికి చెందిన దేరంగుల ప్రభాకర్ ద్విచక్రవాహనంలో బిళ్లూరు వైపు వెళ్తుండగా కొందరు చూశారని, వారిపై అనుమానంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరు వెంకటరమణనాయక్‌ను హత్య చేసి, పెట్రోల్ పోసి కాల్చివేశారన్నారు. విషయం తెలుసుకున్న కర్ణాటక, ఆంధ్ర పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లి, హత్యపై ఆరా తీశారు. హత్యకు కారకుడైన ఆర్ఎంపీ వైద్యుడు బాబుని కర్ణాటకలోని పాతపాళ్యం పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో దేరంగుల ప్రభాకర్‌ను పోలీసులు విచారణకోసం పిలువగా ఆయన 12వ తేదీన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆదివారం వెంకటరమణనాయక్ మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కర్ణాటక పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని గిరిజన సంఘం రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు మూడే ప్రసాద్‌నాయక్, బంధువులు అంత్యక్రియలు జరగకుండా రోడ్డుపై మూడుగంటలపాటు బైఠాయించారు. మృతుడి కుటుంబానికి హత్య చేసిన బాలు ఆస్తులను రాయాలని, ప్రభుత్వం నుంచి అందే పథకాలు అందించాలన్నారు. ఈవిషయంపై ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. చివరికి గ్రామ పెద్దలు కుటుంబసభ్యులకు సరిద్దిచెప్పారు. ఎస్ఐ బలరామయ్య, పోలీస్ సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో జరగకుండా బందోబస్తు నిర్వహించారు.


ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

పండుగ పూట విషాదం

● విద్యుదాఘాతంతో పంచాయతీ కార్యదర్శి మృతి


ప్రశాంతి (ఫైల్)

కళ్యాణదుర్గం, జనవరి 14: భోగి మంటలు వేసుకుని.... ఇంటి ముందర ముగ్గులు వేసి... తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపిన ఆమె కాసేపటికే విగతజీవిగా మారింది. ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కంబదూరు మండలం కొత్త ఐపార్శపల్లికి చెందిన పంచాయతీ కార్యదర్శి నీరుగంటి ప్రశాంతి (28) విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం తెల్లవారుజామున ప్రశాంతి కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు అశ్వత్థనారాయణ, రామలక్ష్మీలతో కలిసి తన సెల్‌ఫోన్‌లోనే ముగ్గులు చూసుకుంటూ తన ఇంటి ముందర ముగ్గులు వేసుకుంటూ ఉంది. ముగ్గు పూర్తైయిన వెంటనే విద్యుత్ వచ్చింది. ఇంట్లో నీళ్ల లేకపోవడంతో సంపులో ఉన్న నీళ్లను మోటర్ ద్వారా ఆన్‌చేయడానికి వెళ్లింది. కరెంట్ ప్లగ్ పెడుతుండగా, ప్రమాదవశాత్తు షాక్ కొట్టడంతో పక్కనే ఉన్న సిమెంట్ తొట్టెపై పడిపోయింది. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యలోనే మృతి చెందింది. కంబదూరు మండలం తిమ్మాపురం పంచాయతీ ఓబిగానిపల్లి సచివాలయం-2లో పంచాయతీ కార్యదర్శిగా ప్రశాంతి పనిచేస్తోంది. ఎంతో ఉన్నత ఆశయంతో ఉద్యోగంలో చేరి కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉంటూ కుటుంబాన్ని పోషిస్తున్న సమయంలో ఆ కుటుంబాన్ని తీరని విషాదంలో నింపింది. జరిగిన సంఘటనను తలుచుకుని తల్లిదండ్రులు రోదనలు మిన్నంటాయి. వీరికి కూతురు ప్రశాంతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

రైతులను మోసం చేసిన వ్యాపారి

● రూ.30 లక్షలు చెల్లించాలని పోలీస్ స్టేషన్ ఎదుట బాధితుల ఆందోళన


పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత రైతులు

కళ్యాణదుర్గం, జనవరి 14: కళ్యాణదుర్గం ప్రాంతంలో పలువురు రైతుల వద్ద నుంచి వివిధ రకాల పంటలు కొన్న ఓ వ్యాపారి మోసం చేశాడని రైతులు కళ్యాణదుర్గం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వద్ద శనివారం అర్ధరాత్రి నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని బోరంపల్లి, ఒంటిమిద్ది, చాపిరి తదితర ప్రాంతాలకు చెందిన 15 మంది రైతులు కణేకల్లుకు చెందిన ఓ వ్యాపారికి రూ.30 లక్షలు విలువ చేసే పంటను విక్రయించారు. మూడు నెలల కావస్తున్నా ఒక్కపైసా ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై అప్పట్లో పోలీసులు ఫిర్యాదు చేస్తే, జనవరి 10న వాయిదా తీసుకున్నారని రైతులు వివరించారు. ప్రస్తుతం అదే వ్యాపారి తమపైనే తిరిగి కేసు నమోదు చేయించడానికి ప్రయత్నిస్తున్నాడని బాధిత రైతులు ఆగ్రహించారు. రైతులు, సీపీఐ తాలుకా నాయకుడు గోపాల్ సహకారంతో పోలీస్ స్టేషన్ లోనే నిరసనకు దిగారు. తమకు న్యాయం జరిగేంతవరకు నిరసన కార్యక్రమాలు చేపడుతామని రైతులు స్పష్టం చేశారు.

'టీడీపీతోనే మహిళల ఆర్థికాభివృద్ధి'

బుక్కరాసముద్రం, జనవరి 14: టీడీపీ అధికారంలోకి వస్తేనే... మహిళ లు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రావణీశ్రీ అన్నారు. ఆదివా రం స్థానిక వీరభద్రకాలనీలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ చేపట్టిన అభివృద్ధి.. చేపట్టబోయే అభివృద్ధి పనులను వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించాలని ప్రజలను కోరారు. జగన్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వనాశమైందని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చి... జగన్ మళ్లీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నాడని, అతని హామీలు, పథకాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, చితంబర దొర, పొడరాళ్ల రవీంద్రా, ఓబులపతి, జీసీ బాబు, పెద్దప్ప పాల్గొన్నారు.

దళిత ద్రోహి సీఎం జగన్ : కందికుంట



సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట

తనకల్లు, జనవరి 14: సీఎం జగన్‌మోహన్ రెడ్డి దళిత ద్రోహి అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. మండలకేంద్రంలోని దళితవాడలో ఆదివారం టీడీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై వైసీపీ ప్రభుత్వం ఎన్నో దాడులు చేయించిందని తెలిపారు. నియోజకవర్గంలోని ఎర్రదొడ్డి గ్రామంలో ఓ దళిత యువకుడు ప్రేమ వివాహం చేసుకున్నాడని అగ్రవర్ణాలు ఇచ్చిన ఫిర్యాదుతో ఓ సీఐ చేయి చేసుకున్నాడన్నారు. దీంతో ఆ దళితయువకుడికి చెవి వినిపించలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినా, ఈసీఐపై చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులకు మంత్రి పెద్దిరెడ్డి సూత్రధారి అని చెప్పారు. ఆయన వెనుక సీఎం ఉన్నారన్నారు. టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తల నమ్మకాన్ని వమ్ము చేయమన్నారు. దగా పడిన వైసీపీ శ్రేణులకు అండగా ఉంటామన్నారు. చైతన్యంతో ఓటు వేసి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డిశేఖర్‌రెడ్డి, కిషోర్, రాజారెడ్డి, దేశాయి ప్రభాకర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, శంకర్‌నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శేషయ్యగారిపల్లి తండాలో భవిష్యత్తుకు గ్యారెంటీ



కరపత్రాలను పంచుతున్న టీడీపీ నాయకులు

ఓబుళదేవరచెరువు, జనవరి 14: మండలంలోని శేషయ్యగారిపల్లి తండాలో టీడీపీ నాయకులు ఆదివారం బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ మినీమేనిఫెస్టో పథకాలను వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆర్ఎంపీ జాకీర్ అహ్మద్, ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి బడిశం రామాంజి, సర్పంచ్ రేణుకాబాయి, తెలుగుయువత నాయకులు ఎనుముల గంగాధర్, కొండే ఈశ్వరయ్య, ఐటీడీపీ ఉపాధ్యక్షుడు పొగాకు షాన్వాజ్, టీరేనాయక్, లక్ష్మీరామ్‌నాయక్, జయచంద్ర నాయక్, రమణి బాయి, శ్రీరాములునాయక్, మనోహర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు టీడీపీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ప్రజల ఇంట ఆనందం వెల్లివిరియాలి: పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జనవరి 14: ధర్మవరం నియోజకవర్గ టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు, పరిటాలరవి అభిమానులకు, ప్రజలకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ ఆదివారం ఒక ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగనాడు ప్రజల ఇంట ఆనందాలు వెల్లివిరియాలని కోరారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ భోగభాగ్యాలతో సంతోషంగా ఉండాలని, అదేవిధంగా వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు.

భోగి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల



అనంతపురంలో భోగిమంట వేసిన మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల దంపతులు

ధర్మవరం, జనవరి14: మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, సతీమణి గోనుగుంట్ల నిర్మల, తనయుడు నితిన్‌సాయి ఆదివారం తెల్లవారుజామున అనంతపురంలోని తన నివాసంలో భోగిమంట వేసి పూజలు చేశారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా భోగి పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం గోనుగుంట్ల సూర్యనారాయణ మాట్లాడుతూ.... ధర్మవరం నియోజకవర్గ ప్రజలందరికీ భోగిపండుగ, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికీ అన్ని కష్టాలు, చెడు ప్రభావాలు తొలగిపోయి భోగభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

కందికుంట నారాయణమ్మ క్రికెట్ టోర్నీ ప్రారంభం



టాస్ వేసి పోటీని ప్రారంభిస్తున్న క్లస్టర్ ఇన్‌చార్జి దండే రవి

నంబులపూలకుంట, జనవరి 14: సంక్రాంతి సందర్భంగా మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం కందికుంట నారాయణమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంటు ప్రారంభించారు. మూడురోజుల పాటు టోర్నమెంటు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ దండే గంగశేఖర్ తెలిపారు. మొదటి రోజు కొత్తపల్లి, గోవిందురాజుపల్లి జట్టు పోటీ పడగా పి.కొత్తపల్లి జట్టు గెలిపొందింది. ఎదురు దొన్న, వంకమంది జట్టు పోటీ పడగా, వంకమంది జట్టు గెలుపొందింది. మంగళవారం జరిగే ఫైనల్‌లో విన్నర్‌కు జట్టుకు రూ.20వేలు, రన్నర్‌కు రూ.10వేలు నగదు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి దండే రవి, మాజీ జెడ్పీటీసీ అంజనప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో జీఆర్పీ పోలీసుల తనిఖీలు

ధర్మవరం, జనవరి 14: ధర్మవరం రైల్వే జంక్షన్‌కు వచ్చే ప్రతి రైలును ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక జీఆర్పీపోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. జీఆర్పీ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ గోపీకుమార్, సిబ్బంది రైలు భోగీలలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ... ఈనెల 22వ తేదీన అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ ఉన్నందున.. ఎటువంటి సంఘటనలు జరగకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. పార్శిల్ సర్వీసు కార్యాలయం కూడా తనిఖీ చేశామన్నారు. రైల్లో ప్రయాణికుల వద్ద ఉన్న బ్యాగులను కూడా తనిఖీ చేస్తూ.. అనుమానాస్పద వ్యక్తులుంటే వారి వివరాలను సేకరించామని పేర్కొన్నారు. ఈ నెలంతా తనిఖీలు చేపడతామని సీఐ పేర్కొన్నారు.

తాగిన మైకంలో తల్లిపై దాడి

● పరిస్థితి విషమం

తాడిమర్రి, జనవరి 14: తాగిన మైకంలో కుమారుడు తల్లిపై కొడవలితో దాడి చేసి గాయపరచిన సంఘటన మండలంలోని మద్దిమాకులపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మద్దిమాకులపల్లికి చెందిన సాకే బాలవీరమ్మ ఆదివారం రాత్రి తన పెద్ద కుమారుడు నరసింహుడు ఇంటి వద్ద నిద్రిస్తుండగా.. చిన్నకుమారుడు ఈశ్వరయ్య వెళ్లి మద్యానికి డబ్బులు ఇవ్వాలని అడిగాడు. అయితే ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన అతను అక్కడే ఉన్న కొడవలితో దాడి చేశాడు. బాలవీరమ్మ ఎడమచెయ్యి దాదాపుగా తెగిపోయింది. దీంతో స్థానికులు ఆమెను బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ నాగస్వామి సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి జరిగిన విషయాన్ని గ్రామస్థులను అడిగి తెలుసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కన్నులపండువగా గోదారంగనాథస్వామి కల్యాణం

● అధికసంఖ్యలో హాజరైన భక్తజనం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మవరం, జనవరి14: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ధనుర్మాసం భోగి సందర్భంగా ఆదివారం గోదారంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని అర్చకులు మకరందబాబు, కోనేరాచార్యులు, భానుప్రకాశ్ కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయంలో ముందుగా గోపూజ జరిపారు. అనంతరం చెన్నకేశవ స్వామి మూలవిరాట్టును వివిధ రకాల పూలతో, పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత గోదారంగనాథ స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగ అలంకరించి కల్యాణోత్సవాన్ని వేదమంత్రోచ్ఛారణల నడుమ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి వేడుకలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం మోహినీ ఉత్సవంలో స్వామివారిని పురవీధులగుండా ఊరేగించారు. ఆలయ చైర్మన్ దాశెట్టి సుబ్రమణ్యం, ఈఓ వెంకటేశులు, ఉపాధ్యక్షుడు చౌడయ్య, డైరెక్టర్ పౌరాళ్లపద్మావతి పాల్గొన్నారు.

అరాచక పాలన త్వరలోనే అంతం

● మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ● వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ప్రజావ్యతిరేక జీఓ ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం



అనంతపురంలో జీఓ ప్రతులను భోగి మంటలో వేసి దహనం చేస్తున్న పల్లె



ధర్మవరంలో జీఓ ప్రతులను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



తాడిమర్రిలో ..

పుట్టపర్తి, జనవరి 14: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వం త్వరలో అంతం కానున్నదని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. అనంతపురంలోని నివాసం వద్ద ఆదివారం తెల్లవారుజామున అయన వైసీపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన ప్రజావ్యతిరేక జీవో ప్రతులను భోగి మంటలో వేసి దహనం చేశారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రానికి పట్టిన పీడగా అభివర్ణించారు. ఆ పీడ భోగి మంటలో ఆహుతికావాలన్నారు. రానున్న ఎన్నికల్లో సైకో పాలనకు ముగింపు పలికి, సైకిల్ పాలన తీసుకురావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ధర్మవరం: రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందని టీడీపీ నాయకులు మండిపడ్డారు. పట్టణంలోని గాంధీనగర్ సర్కిల్లో వైసీపీ తెచ్చిన ప్రజా వ్యతిరేక జీఓ ప్రతులను, చంద్రబాబు అరెస్టు ఎఫ్ఐఆర్ కాపీలను భోగిమంటల్లో వేసి దహనం చేశారు. సైకో పోవాలి, సైకిల్ రావాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్లగా వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజావ్యతిరేక జీఓకాపీలను, చంద్రబాబు అక్రమ అరెస్టు ఎఫ్ఐఆర్ కాపీలను భోగిమంటల్లో వేసి దహనం చేశామన్నారు. రాష్ట్రంలో తమ సొంత హక్కుల కోసం పోరాడుతున్న వారిపైన ప్రభుత్వం దౌర్జన్యకాండ సాగిస్తోందని మండిపడ్డారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం రాబోతుందన్నారు. చంద్రబాబునాయుడు మళ్లీ సీఎం కాబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కమతంకాటమయ్య ఫణికుమార్, పరిశేసుధాకర్, పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, రాళ్లపల్లి షరీఫ్, అంబటిసనత్, గరుగువెంగప్ప, శీలామూర్తి, బొట్టుకిష్ట, మారుతిస్వామి, కరెంటు ఆది, మాధవరెడ్డి, పల్లపురవీంద్ర, పల్లపు శివశంకర్, కేశగాళ్లశీన, అడ్రామమహేశ్, కేతినేని రాజ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: వైసీపీ తెచ్చిన ప్రజా వ్యతిరేక జీఓ కాపీలను, చంద్రబాబు అరెస్టు ఎఫ్ఐఆర్ కాపీలను మండలకేంద్రంలో టీడీపీ నాయకులు భోగి మంటలో వేసి దహనం చేశారు. పలువురు మాట్లాడుతూ.. గత నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అరాచకాలు, దౌర్జన్యాలు తప్పా అభివృద్ధి జరిగిందేమీ లేదన్నారు. ఈ ప్రభుత్వం ఇంటికి పోయే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పేర్కొన్నారు. రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని తెలిపారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు హర్ష, నాయకులు ఫక్కీర్‌రెడ్డి,గణేశ్, మురళి, రవీంద్రనాయుడు పాల్గొన్నారు.

తనకల్లు: మండలకేంద్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజావ్యతిరేక విధానాలపై వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రతులను భోగి మంటలో వేసి దహనం చేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు నాలుగు వందల మందికిపైగా ఆత్మహత్య చేసుకున్నారు. దేశంలో నిరుద్యోగ్యం మొదటిస్థానంలో ఉందన్నారు. సీఎం జగన్ 85 శాతం హామీలను అమలు చేయలేదన్నారు. సైకో పోవాలి, సైకిల్ రావాలని నినాదాలు చేశారు. ఈ భోగితో కీడు పోవాలి.. ఏపీ వెలగాలంటూ నినాదించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి, నాయకులు సోంపాళ్యం నాగభూషణం, దస్తగిరి, జియావుల్లా , రమణ, చిన్నప్ప, ఉత్తన్ననాయక్, శ్రీధర్‌రెడ్డి, సరోజమ్మ , శోభారాణి, శంకర్‌నాయుడు, రాజారెడ్డి, ఆనంద్‌రెడ్డి, శ్రీరాములనాయక్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: ప్రజా వ్యతిరేక జీవో ప్రతులను మండలకేంద్రంలో టీడీపీ నాయకులు భోగి మంటలో వేసి దహనం చేశారు. పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజావ్యతిరేక జీవోలు ఇవ్వడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఆచారక పాలన సాగుతోందన్నారు. ఈపాలనకు చర మగీతం పాడాలని ప్రతులను కాల్చివేశామన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ మైలే శివ శంకర్, నాయకులు బుట్టి నాగభూషణనాయుడు, మంజునాథ్‌రెడ్డి, పల్లపు ప్రతాప్, ఆటో కేశవ, మహేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండలకేంద్రంలోని టీడీపీ నాయకులు వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజావ్యతిరేక జీఓ కాపీలను, చంద్రబాబు అరెస్టు ఎఫ్ఐఆర్ కాపీలను భోగిమంటలో వేసి దహనం చేశారు. అనంతరం సైకో పోవాలి.. సైకిల్ రావాలని నినదించారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌బాబు, కరణంప్రభాకర్, తుమ్మలమనోహర్, తుమ్మలసూరి, వినోద్‌బాబు, ఆనంద్, చికెన్‌తిరుపాల్, నారాయణస్వామి, గడ్డం మోహన్, అశోక్, నందా, అమీర్, కిష్టప్ప, చంద్ర, అబ్దుల్ పాల్గొన్నారు.



తనకల్లులో ..



నల్లమాడలో ..



ముదిగుబ్బలో ..

70 కుటుంబాలు టీడీపీలోకి చేరిక



టీడీపీలోకి చేరిన తనకల్లు వాసులతో కందికుంట వెంకటప్రసాద్



టీడీపీలో చేరిన తలుపుల మండల మైనార్టీ కుటుంబాలతో కందికుంట

తనకల్లు, జనవరి 14: మండలకేంద్రంలోని దళితవాడలో ఆదివారం సుమారు 70కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో వారందరూ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరినవారిలో ప్రసాద్, సునీల్, మస్తాన్, నగేష్, నాగేంద్ర, మహేష్, వెంకటేష్, సాయి, క్రాంతి, లక్ష్మీనారాయణ, మంజు, నాగేంద్ర, నరసింహులు, రంజిని తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ ప్రతిఒక్కరూ టీడీపీ విజయానికి శాయశక్తిలా కృషి చేయలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, తోటకిషోర్ , రమణ చంద్రప్ప, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

50 మైనార్టీ కుటుంబాల చేరిక

కదిరి: తలుపుల మండలకేంద్రంలోని పూల బజారులో వైసీపీకి చెందిన 50 మైనార్టీ కుటుంబాల వారు ఆదివారం టీడీపీలోకి చేరారు. మండల కన్వీనర్ ముబారక్, నాయకుడు మేడా శంకర్ ఆధ్వర్యంలో చేశారు. కదిరి పట్టణంలోని కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో వారు పార్టీ తీర్థపుచ్చుకోగా.. కందికుంట వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

యువకుల చేరిక

నల్లచెరువు: మండలంలోని బాలేపల్లి తండాకు చెందిన 30 మంది యువకులు ఆదివారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కదిరి పట్టణంలోని కందికుంట నివాసంలో వారు నాయకుడు గంగరాజు ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కందికుంట వెంకటప్రసాద్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో గంగరాజునాయక్, నవీన్‌నాయక్, ప్రవీణ్‌నాయక్, మహేంద్రనాయక్, జ్యోతినాయక్, మంజునాయక్, సంతోష్‌నాయక్,బాలాజీనాయక్, పీరేనాయక్, శ్రీకాంత్‌నాయక్, నరేష్‌నాయక్ ఉన్నారు.

వైసీపీ కార్యకర్తల చేరిక

కదిరిఅర్బన్: మండలంలోని పట్నం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. పట్టణంలోని కందికుంట నివాసంలో వారు పార్టీలో చేరారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో గౌరీబాయి. ప్రియాంకబాయి, రాంప్రసాద్, ప్రసాద్, క్రిష్ణనాయక్, శీనానాయక్, రమణనాయక్, రెడ్డెప్పనాయక్, బాలాజీనాయక్; సూర్యనారాయణ,రవినాయక్ ఉన్నారు. టీడీపీ నాయకులు ప్రసాద్, ఆంజనేయులు, రమణ, సురేష్‌బాబు, వెంకటప్ప పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పల్లె పరామర్శ



ఓడీసీలో తలారి నారాయణ కుటుంబసభ్యులకు ఆర్థికసాయం చేస్తున్న పల్లె

ఓబుళదేవరచెరువు, జనవరి 14: మండలకేంద్రంలో ఇటీవల మృతిచెందిన తలారి నారాయణ కుటుంబాన్ని మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఆదివారం వెళ్లి పరామర్శించి తనవంతుగా ఆర్థికసాయం అందజేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న చాకలి రమణ, మహమ్మద్‌ఖాన్‌ను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, నాయకులు సుధాకర్, పిట్టా ఓబుళరెడ్డి, మహబూబ్‌బాషా, మండోజీ ఆర్షీఖాన్, చికెన్‌షాను, షబ్బీర్, సాదీనాగరాజు, తోఫీక్‌ఖాన్, సునిల్ కుమార్, ఎం. శ్రీనివాసులు, సాదీనాగరాజు తదితరులు ఉన్నారు.

కొత్తచెరువు: మండలంలోని బైరాపురం, యర్రపల్లి గ్రామాల్లో మాజీ మంత్రి పల్లెరఘునాథ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పలు బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేసి టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. బైరాపురంలో హరిజన గంగరత్నమ్మ, నరసింహులు కుటుంబాలను, యర్రపల్లిలో శ్రీనివాసులు, యజ్జేచెన్నప్ప కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పల్లె వెంట మాజీ సర్పంచ్‌లు కేశప్ప, కిష్టప్ప, వెంకటరమణప్ప, మాజీ ఎంపీటీసీ సురేశ్‌నాయుడు, బైరాపురం సర్పంచ్ రవి, నాయకులు ఒలిపి శీనా, డ్రైవర్ కేశప్ప, ఓబుళరెడ్డి, శంకరప్ప, లక్ష్మీనారాయణ, చంద్ర, చెన్నారెడ్డి, గుర్రప్ప ఉన్నారు.

బీసీల సమస్యలపై కలిసికట్టుగా పోరాడుదాం

● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట

కదిరిఅర్బన్, జనవరి 14: బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై అందరం కలికికట్టుగా పోరాటం చేయాలని పలువురు బీసీ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో ఆదివారం బీసీలు ఎదుర్కొంటు సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు చింతా నాగరాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్, వైసీపీ, సీపీఐ, బీజేపీ, బీసీ సంఘం నాయకులు బత్తల వెంకటరమణ, వేమయ్య, వెంకటేష్, పెద్దన్న తోపాటు వివిధ ఉపకులాల, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ప్రయోజనాలు సాధించుకోవడానికి ప్రతి ఒక్కరు త్యాగాలకు సిద్ధం కావాలన్నారు. దేశంలో బీసీ జనాభా 70కోట్లు ఉందని, మొత్తం జనాభాలో ఇది 56శాతమని అంచనా వేశారు. 90 ఏళ్లనాటి డేటా ఆధారంగానే కొనసాగుతున్న రిజర్వేషన్ల వల్ల బీసీలు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. 76 ఏళ్ల స్వాతంత్ర్య చరిత్రలో బీసీల జనాభాను గణనలోకి తీసుకోకపోవడం ఆశ్చర్యకరమన్నారు. కులగణన చేపడితే జనాభాకు అనుగుణంగా బీసీలకు విద్య, ఉద్యోగ, సామాజిక రంగాల్లో తగిన ప్రాతినిధ్యం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు నారాయణ, రామమోహన్, భాస్కర్, శ్రీనివాసులు, బీ. శ్రీనివాసులు, మునిస్వామి, ఆర్టీసీ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భోగి

నంబులపూలకుంట, జనవరి 14: సంక్రాంతి సందర్భంగా మొదటి రోజు భోగిపండుగను మండల ప్రజలు ఆదివారం ఘనంగా జరిపారు. తెల్లవారుజామునే భోగిమంటలు ఏర్పాటు చేసుకుని పిల్లలు వద్ద నుంచి వృద్ధుల వరకు ఆనందంగా గడిపారు. మహిళలు ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలను ఉంచి పూజలు చేశారు. సాయంత్రం చిన్నారుల తలపై భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు.



నంబుల పూలకుంటలో భోగిమంట వద్ద చిన్నారులు, పెద్దలు

పూర్వ విద్యార్థుల రక్తదానం

నల్లచెరువు, జనవరి 14: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2002-03 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పూర్వ విద్యార్థులే రక్తదానం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ వివిధ కారణాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవడానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కదిరి ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అఖండ జ్యోతి

ఓబుళదేవరచెరువు, జనవరి 14: మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప ఆలయంలో ఆదివారం ఆఖండ జ్యోతి కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయులనాయుడు తెలిపారు. తొలుత వినాయక, సుబ్రమణ్యస్వామి, అయ్యప్ప స్వామి మూలవిరాట్‌లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 18 కిలోల కర్పూరంతో ఆఖండ జ్యోతిని వెలిగించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి జ్యోతి దర్శనం చేసుకున్నారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్టు

నంబులపూలకుంట, జనవరి 14: మండలంలోని పెడబల్లి సమీపంలో కోడిపందేలు ఆడుతున్న పదిమందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎన్‌వీ రమణ తెలిపారు. సమాచారం రావడంతో వెంటనే సిబ్బందితో కలిసి దాడులు చేసి కోడిపందెం ఆడుతున్న పదిమందిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. అలాగే రెండుకోళ్లను, రూ.8,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కోడిపందెం రాయుళ్లను కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ వడ్డెర్లకు కేటాయించాలి

నల్లమాడ, జనవరి 14: పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ టీడీపీ వడ్డెర్లకు కేటాయించాలని, వడ్డెర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మల్లెల జయరాం పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పుట్టపర్తి నియోజకవర్గంలో 50వేల ఓట్లు వడ్డెర్లవి ఉన్నాయన్నారు. టీడీపీ అభివృద్ధి కోసం వడ్డెర్ల ఎంతో కష్టపడి పనిచేశారన్నారు. కనుక వచ్చే ఎన్నికల్లో వడ్డెర్లకు టిక్కెట్ కేటాయించాలలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పల్లపు జయచంద్రమోహన్, కిష్టప్ప, రామప్ప, రమణ, శ్రీరాములు, చంద్రాయుడు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కొత్తచెరువు, జనవరి 14: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామీణ ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్ సూచించారు. కొత్తచెరువు పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కేసుల రికార్డులను పరిశీలించారు. ఇసుక, మద్యం అక్రమ రవాణాపై నిఘా ఉంచాలని సీఐ రాగిరి రామయ్య, ఎస్ఐ సురేశ్‌బాబులను ఆదేశించారు. నేరచరిత్ర ఉన్నవారు, రౌడీషీటర్ల నడవడికలపై ప్రత్యేకనిఘా ఉంచాలన్నారు. అదేవిధంగా ట్రాఫిక్‌పై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

జాబ్ క్యాలెండర్ పేరుతో మోసం

పుట్టపర్తి, జనవరి 14: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జాబ్‌క్యాలెండర్ పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేరశారని టీడీపీ నాయకులు మండిపడ్డారు. అందుకు సంబంధించిన ఆ జీవో ప్రతులను వారు ఆదివారం భోగి మంటల్లో వేసి దహనం చేశారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో అంబులెన్సు రమేష్, శ్రీరాములు, రామాంజనేయులు, చిట్టబాబు, బాలక్రిష్ణ, పోతన్న, సాయికుమార్, సోము తదితరులు జీవో ప్రతులను దహనం చేశారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో యువతకు ఎలాంటి ఉపాధి కల్పించలేదన్నారు. అంతా మోసమన్నారు. ఆడుదాం ఆంధ్రపేరుతో యువతను మభ్యపెట్టడానికి వైసీపీ కుట్ర చేస్తోందని మండిపడ్డారు.

సాగునీటి సాధనతోనే రాయలసీమ సమగ్రాభివృద్ధి

కదిరిఅర్బన్, జనవరి 14: రాయలసీమ ప్రాంతం సమగ్రాభివృద్ధి సాగునీటి సాధనతోనే సాధ్యమని, అన్నివర్గాల వారు నీటి అంశాలు, హక్కులపై అవగాహన పెంచుకోవాలని కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం వేమన అధ్యాన అభివృద్ధి కేంద్రం సమన్వయ కర్త చింతా శరత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథ రామిరెడ్డి రాసిన 'నీటిఅవగాహన రాయలసీమకు రక్ష' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కవి ఉద్దడం చంద్రశేఖర్, పాత్రికేయులు రమణ, రామక్రిష్ణ, వరదారెడ్డి, సుదర్శన్, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నల్లమాడ, జనవరి 14: మండలంలోని గూడుమేకల పల్లి వద్ద ప్రధాన రహదారి పక్కన ఆదివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పలువురు పాదచారులు రహదారి వెంట వెళుతుండగా.. తీవ్ర దుర్వాసన వచ్చింది. దీంతో వారు గాలించగా.. సమీపంలోని పాడిబడిన పిల్లగుండ్ల బావిలో గుర్తు తెలియని మృతదేహం తేలియాడుతూ కనిపించింది. వెంటనే వారు గూడుమేకలపల్లి గ్రామస్థులకు తెలపగా విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై పోలీసులను అడుగగా తమకు సమాచారం రాలేదన్నారు. మృతదేహానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

పుట్టపర్తి, జనవరి 14: పట్టణంలోని చిత్రావతి బైపాస్ రోడ్డు సమీపంలో ఆదివారం తెలుగుదేశం, జనసేన పార్టీలు సంయుక్తంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో సుమారు 50మంది మహిళలు పాల్గొని రకరకాల ముగ్గులు వేశారు. ప్రతిభ చూపిన ముగ్గులకి ఉత్తమ బహుమతులతో పాటు, పోటీల్లో పాల్గొన్న వారందరికీ కూడా మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, జనసేన జిల్లా కార్యదర్శి పత్తి చంద్రశేఖర్, బహుమతులు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోమకోటి ఆదినారాయణ, లావణ్య, ఆంజనేయులు, బేకరీ నాయుడు, చెన్నక్రిష్ణమ్మ, జనసేన నాయకులు రాము, గంగాధర్, యశ్వంత్, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న పల్లె, పత్తి చంద్రశేఖర్

భక్తుల కొంగుబంగారం

నాగలమడక సుబ్రహ్మణ్యేశ్వరుడు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

పావగడ, జనవరి 14: కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల ప్రజల ఆరాధ్యదైవం , భక్తులు కొంగు బంగారంగా కొలిచే నాగలమడక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవాన్ని మంగళవారం వేలాది మంది భక్తుల నడుమ వైభవంగా జరగనుంది. ఈ క్షేత్రాన్ని అంత్య సుబ్రహ్మణ్యేశ్వరం అని పిలుస్తారు. ఇది కర్ణాటకలోని తుముకూరు జిల్లాలో ఉంది. కర్ణాటకలోని ఘాటి, కుక్కె క్షేత్రాల తరువాత అంత్య సుబ్రహ్మణ్యంగా పేరొందిన స్వామి నాగలమడకలో కొలువై ఉన్నాడు. ఈనెల 16న మంగళ వారం జరిగే స్వామి బ్రహ్మరథోత్సవానికి దూరపు ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. భక్తుల సౌకర్యార్థ దేవాదాయ శాఖ అధికారులు అన్న సంతర్పణ, స్నానపు గదులు తదితర ఏర్పాట్లు పూర్తి చేశారు. బస్సు సౌకర్యాలు కల్పించారు. ఒకప్పుడు ఇక్కడ జరిగే ఎద్దుల పరుష ప్రసిద్ధి గాంచింది. అయితే ప్రస్తుతం పశువుల సంఖ్య తగ్గిపోవడంతో కొద్దిమేర జరగ నుంది.

పులివిస్తర్ల నిషేధం పొడిగింపు: ఇక్కడ గతంలో ఉన్న పులిఇస్తర్ల లో దొర్లే ఆచారాన్ని దేవదాయ శాఖాధికారులు పది సంవత్సరాల నుంచి నిషేధించారు. ఆ నిషేధం ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు దేవదాయ శాఖాధికారి నాగరాజు, పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్ రథాన్ని లాగి బ్రహ్మరథోత్సవాన్ని ప్రారంభించనున్నారు.

జయమంగళి నదీ తీరంలో...

హిందూపురం అర్బన్: పరిగి మండల పరిధిలోని జయమంగళి నదీ తీరంలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రథోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు సుబ్రహ్మణ్యేశ్వర సేవాసమితి సభ్యులు ఆదివారం తెలిపారు. సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి ధ్వజారోహణ ఉంటుందన్నారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

లారీ బోల్తా



అదుపు తప్పి బోల్తా పడిన లారీ

మడకశిరటౌన్, జనవరి 14: మండలంలోని మధుగిరి-కొడికొండ చెక్‌పోస్టు మధ్య హైవేలో ఆదివారం వేరుశనగ పొట్టు లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మడకశిర వైపు నుంచి కర్ణాటక ప్రాంతం తుమకూరుకు వెళుతుండగా లారీ బోల్తాపడినట్లు స్థానికులు తెలిపారు.



జీఓ ప్రతులను భోగి మంటల్లో వేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న



భోగి మంటల్లో జీఓ ప్రతులను తగలబెడుతున్న మడకశిర నాయకులు

చీకటి జీఓలు ఎప్పటికైనా మంటగలవాల్సిందే

మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న

మడకశిరటౌన్, జనవరి 14: వైసీపీ ప్రభుత్వం చీకటి జీఓలు తెచ్చి ప్రతిపక్షాలను భయపెట్టాలని చూస్తే, అది ముమ్మాటికి సాధ్యం కాదని, చీకటి జీఓ ఎప్పటికైనా భోగి మంటల్లో కలవాల్సిందేనని మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయ ఆవరణంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భోగి సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర సమస్యల ఫొటోలు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అబద్ధపు హామీలు, జగన్ చేసిన దారుణాలను, వాటి ప్రతులను భోగి మంటల్లో వేసి తగలబెట్టామని పేర్కొన్నారు. వచ్చే సంవత్సరం అందరం కలిసికట్టుగా ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించి, చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. అప్పుడు ఆనందంగా సంక్రాంతిని జరుపుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రం బాగుండాలంటే జగన్ ఇంటికిపోవాలి..

రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలంటే సీఎం జగన్ దిగిపోవాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నాగరాజు, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు భక్తర్ పేర్కొన్నారు. వారు ఆదివారం పట్టణంలోని బాలాజీ నగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంలో భోగి సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం విపక్షాలను అణచడానికి తెచ్చిన జీఓ ప్రతులను బోగ మంటల్లో తగలబెట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం చీకటి జీవోలను తీసుకొచ్చి విపక్షాలను, ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, మంటల్లో తగలబెట్టడానికే తప్ప అవి వేటికీ ఉపయోగకరం కావన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు మనోహర్, మున్సిపల్ మాజీ చైర్మన్ సుబ్బరాయుడు, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ ఉమాశంకర్, నాయకులు చంద్రప్ప, సన్నీరప్ప, తిమ్మరాజు, అక్కంపల్లి బాబు, కట్టాకిషోర్, మల్లికార్జున, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

గంజి తాగి అంగన్‌వాడీల నిరసన

భోగిమంటల్లో ఎస్మా ప్రతుల దహనం



పురంలో ఎస్మా ప్రతులను భోగిమంటల్లో దహనం చేస్తున్న దృశ్యం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న సమ్మె ఆదివారం 34వ రోజుకు చేరుకుంది. హిందూపురం పట్టణంలోని సద్భావనా సర్కిల్ పాత బీపీఎల్ షోరూమ్ ఎదుట అంగన్‌వాడీలు గంజితాగి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల జీతాల్లో కోతలు విధించింది. ఇప్పటికే చాలీచాలని జీతాలతో జీవిస్తున్న తమకు కోతలు విధించడంతో గంజితాగి బతకాల్సిన దుస్థితి పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఎస్మా ప్రతులను భోగిమంటల్లో దహనం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాటలు నిలెబట్టుకోవాలని కోరారు. అలాగే పెనుకొండ, మడకశిర, రొద్దం, చిలమత్తూరు, గుడిబండ, అగళి తదితర కేంద్రాల్లో అంగన్‌వాడీలో పండుగ రోజు కూడా తమ నిరసన కొనసాగించారు. ఎస్మా ప్రతులను భోగిమంటల్లో నిరసన వ్యక్తం చేశారు.



చిలమత్తూరులో జీఓ ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

ప్రధాని పర్యటనలో ఏలోటూ రాకూడదు

ఏర్పాట్లను పరిశీలించిన జేసీ అభిషేక్ కుమార్



నాసిన్ కేంద్రంలో సూచనలిస్తున్న జేసీ

హిందూపురం, జనవరి 14: గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద నాసిన్ కేంద్రాన్ని ఈనెల 16న భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. పర్యటన ఏర్పాట్లపై ఆదివారం జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ నాసిన్ కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రధాని పర్యటనలో ఏలోటు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. హెలిప్యాడ్, సభావేదిక, ప్రధాని ప్రారంభించే భవనాలు, పర్యటించే మార్గాలను పరిశీలించి స్థానిక అధికారులకు సూచనలు ఇచ్చారు. సోమవారం సాయంత్రానికి ఏర్పాట్లు పూర్తికావాలని ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో జేసీ వెంట జిల్లా అధికారులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

నేడు వీరేంద్రహెగ్డే చిత్రపటానికి క్షీరాభిషేకం

మడకశిరటౌన్, జనవరి 14: కర్ణాటకలోని ధర్మస్థల గ్రామీణాభివృద్ధి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు వీరేంద్రహెగ్డే చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మడకశిర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చి నియోజకవర్గాన్ని దత్తత తీసుకోవడంతో మంజునాథస్వామి, వీరేంద్రహెగడే చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ద్విచక్రవాహన ప్రమాదంలో యువకుడి మృతి

గోరంట్ల, జనవరి 14: మండలంలోని పులేరు రహదారిలో అంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం రాత్రి ద్విచక్రవాహన ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన మోహన్ మిత్ర(34) మృతి చెందినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. బీహార్ రాష్ట్రంలోని దర్భాంగ్ జిల్లా భవానీపురానికి చెందిన మోహన్ మిత్ర ఆరేళ్లుగా గోరంట్లలోనే నివాసమంటున్నాడు. కూలిపనులకు వెళ్లి జీవించేవాడు. ప్రస్తుతం గోరం ట్ల మండలంలో గ్రీన్‌ఫీల్డు ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణ పనులకు వెళ్లే వాడు. పనులు ముగించుకుని శనివారం రాత్రి గోరంట్లకు తిరిగి వస్తుం డగా ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన గుంతలో బోల్తా పడింది. తరువాత గుర్తించిన తోటి కూలీలు రాత్రి 11గంటల సమయంలో అతడిని గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే మృతిచెందిన ట్లు వైద్యులు నిర్ధారించారు శవాన్ని పోస్టమార్టం నిమిత్తం పెనుకొండకు తరలించినట్లు, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి

రొళ్ల, జనవరి 14: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని ఆదివారం మండలంలోని సోమగట్ట గ్రామంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు రవికుమార్, రామకృష్ణ, బాబు, చౌడప్ప, హనుమంతరాయప్ప, సోమగట్ట వడ్డే కాలనీవాసులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



రొద్దం వద్ద ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

రొద్దం, జనవరి 14 : హిందూపురం డిపోకు చెందిన రొద్దం వెళ్లే ఆర్టీసీ బస్సు మార్గ మధ్యలో మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హిందూపురం నుంచి ఏపీ29 జెడ్2430 నంబరు బస్సు ఆదివారం సాయంత్రం 4గంటల సమయంలో రొద్దం వచ్చింది. తిరుగు ప్రయాణంలో కందుకూర్లపల్లికి వెళ్లేదారిలో ఉన్నట్టుండి ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు హిందూపురానికి వెళ్లేందుకు నానా అవస్థలు పడ్డారు. హిందూపురం నుంచి మెకానిక్ వచ్చేవరకు కండెక్టర్, డ్రైవర్, కొంతమంది ప్రయాణికులు అక్కడే వేచి ఉన్నారు. సాయంత్రం మరమ్మతుల అనంతరం హిందూపురానికి బయలుదే రింది. కాలం చెల్లిన బస్సులు తరచూ మరమ్మతులకు వస్తున్నాయని ప్రయాణికులు వాపోయారు.

నాసిన్‌తో ఉపాధి అవకాశాలు మెరుగు

బీజేపీ నాయకులు



మాట్లాడుతున్న జీఎం శేఖర్, విష్ణువర్ధన్‌రెడ్డి

గోరంట్ల, జనవరి 14: అత్యంత వెనుకబడిన శ్రీసత్యసాయి జిల్లాలోని పాలసముద్రం వద్ద నాసిన్ అకాడమిని ఏర్పాటుచేయం వలన రాష్ట్రాభివృద్ధితో పాటు 50వేలమందికి పత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ మంగళ వారం నాసిన్ అకాడమిని ప్రారంభిస్తుండడంతో వారు అక్కడ పర్యటించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈసందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఐఆర్ఎస్ శిక్షణ కేంద్రం తోపాటు కొత్త రైల్వేలైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర విభజన హామీలో భాగంగానే నాసిన్ ఏర్పాటు అవుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఏపీ పట్ల ఉన్న చిత్త శుద్ధికి నిదర్శనమన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరీ ఆధ్వర్యంలో ప్రధాని, కేంద్ర మంత్రులకు పార్టీ ప్రముఖులతో కలిసి ఘనస్వాగతం పలుకుతున్నట్లు చెప్పారు. ఈ ప్రాంత అభివృద్ధికి సంబంధించి ప్రధానికి విజ్ఞాపన పత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుదర్శన్, పార్థసారథి, చంటి, ఈశ్వర్‌రెడ్డి, మేదర శ్రీనివాసులు, రామక్రిష్ణ, ఆదర్శకుమార్ పాల్గొన్నారు.

ఏపీలో పర్యటించే హక్కు ప్రధానికి లేదు

కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరసింహులు

గోరంట్ల, జనవరి 14: ఏపీలో పర్యటించే నైతిక హక్కు ప్రధాని నరేంద్రమోదీకి లేదని కాంగ్రెస్‌పార్టీ పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరసింహులు అన్నారు. ఆయన ప్రధాని స్థాయిని దిగజారుస్తున్నారని ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని తిరుపతి వెంకన్న సాక్షిగా హామీ ఇచ్చిన మోదీ మాట తప్పారన్నారు. పాలసముద్రం గ్రామానికి చెందిన 500 ఎకరాల నాసిన్ భూనిర్వాసితులకు నష్టపరిహారం సరిగా ఇవ్వలేదని, ఆర్ అండ్ఆర్ ప్యాకెజీ ఇవ్వకుండా మోసం చేశారన్నారు. శంకుస్థాపన సమయంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లాలని ప్రయత్నించిన రైతులను పోలీసులు అరెస్టు చేశారన్నారు. నాసిన్ కోసం భూములిచ్చిన రైతులను సన్మానించాలని డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఇంకా 30శాతం పనులు పెండింగ్‌లో ఉన్నా పట్టించుకోకుండా దిగజారి ప్రారంభిస్తున్నారని విమర్శించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చి, నాసిన్ పనులు పూర్తి అయ్యాక ప్రారంభించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు.

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోండి

దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

హిందూపురం, జనవరి 14: జూనియర్ న్యాయవాది రవికుమార్‌పై దాడిచేసిన హెడ్‌కానిస్టేబుల్ మహేష్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఆదివారం హిందూపురంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... తనపై హెడ్‌కానిస్టేబుల్ మహేష్ దుర్భాషలాడి దాడిచేశారన్నారు. వెంటనే ఆయనను సస్పెండ్‌చేసి కేసు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ శ్రీరాములు, కార్మిక సంఘం నాయకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే న్యాయవాది రవికుమార్ తననే దుర్భాషలాడి అనవసరంగా తనపైనే ఫిర్యాదు చేశాడని హెడ్‌కానిస్టేబుల్ మహేష్ పేర్కొన్నారు. తన విధులకు ఆటంకం కలిగించి బెదిరించాడని, దీనిపై తాను ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఏకశిలా విగ్రహ నిర్మాణానికి విరాళం

హిందూపురం అర్బన్, జనవరి 14: పట్టణ పరిధిలోని మేళాపురం బైలాంజనేయ స్వామి దేవాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 27 అడుగుల ఏకశిలా అంజనేయ స్వామి విగ్రహ నిర్మాణానికి పలువురు ఆదివారం విరాళాలు అందించారు. ముద్దిరెడ్డిపల్లి పట్టు చీరల వ్యాపారి ఏసీ నాగరాజు రూ.లక్ష, పరిగి గోపాల్ రూ.50 వేలు విరాళంగా అందించారు.

పుస్తకావిష్కరణ

రొద్దం, జనవరి 14: మండల పరిధిలోని కోగిర గ్రామంలో రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 'నీటి అవగాహన రాయలసీమకు రక్ష' అన్న పుస్తకాన్ని ఆవిష్కరించారు. కోగిర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జేవీవీ నాయకుడు హరి అధ్యక్షతన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కవి కోగిర జయచంద్రారెడ్డి, రాయలసీమ విద్యావంతుల వేదిక సభ్యులు ఆదిశేఖర్, టైలర్ అంజనేయులు, సూరి తదితరులు పాల్గొన్నారు.

భోగభాగ్యాలను అందించే భోగి



ఆర్ మరువపల్లిలో భోగిమంట వేసిన చిన్నారులు, పెద్దలు



పెనుకొండలో ముగ్గులు వేస్తున్న మహిళలు

హిందూపురం అర్బన్/పెనుకొండ/ రూరల్/ రొద్దం/ అగళి: , జనవరి 14: భోగభాగ్యాలను అం దించే భోగి పండుగను హిందూపురం, పెను కొండ, మడకశిర పట్ట ణాలతో పాటు ఆయా నియోజకవర్గాల్లో ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే ఇంటి ఎదుట భోగి మంటలు వేసి అందులో పాత వస్తువులను దహనం చేశారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించే సందర్భంగా భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని పలువురు ఆకాంక్షించారు. సంక్రాంతి సందర్భంగా పెనుకొండ పట్టణంలో వ్యాపార కూడళ్లన్నీ కొనుగోలుదారులతో కిక్కిరిసి పోయాయి. కొనుగోలు దారులతో వారపు సంత కిట కిటలాడింది. వాహన రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ స్తంభించింది.